# జానపద కళతో జన చైతన్యం

## జానపదకళ పరిశోధకులు డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి



ఎంతో విశిష్టత కలిగిన జానపదకళను కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని జానపద నృత్యకళ పరిశోధకులు డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదినుంచి కూడా జానపద నృత్యకళ ద్వారానే జాతిని చైతన్యపరచారని పేర్కొన్నారు. అన్ని కళలకు ఆధారభూతమైన జానపదకళ అభ్యున్నతికి ఇంతవరకు ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదని ఆయన భావించారు. జానపద ప్రదర్శనకళపై రాష్ట్రంలో డాక్టరేట్ పొందిన మొదటి వ్యక్తి చిగిచెర్ల కృష్ణారెడ్డి. ఈయన ధర్మవరం తాలుకా జానపద గేయాలపై ఎం.ఫిల్ చేశారు. వివిధ జిల్లాల్లోని జానపద కళారూపాలను అధ్యయనంచేసి పరిశోధనా గ్రంథాలు రచించారు. పలు ప్రాంతాల్లో ఈకళపై సదస్సులు నిర్వహించారు. అలాగే వేసవి శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తూ జానపదకళ, కళాకారుల అభ్యున్నతికి విశేషమైనకృషి సాగిస్తున్నారు.

ఇదే విధంగా జానపద కళాకారులపై పలు ప్రాజెక్టులు రూపొందిచటమే కాక, ఏ ఏ ప్రాంతంలో ఎంతమంది కళాకారులున్నారనే వివరాలు ఈయన సేకరించారు. ప్రస్తుతం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద విభాగ

> *దేశంలోనేకాక అంతర్జాతీయ స్థాయిలో కూడా జరిగే సదస్సుల్లో కూడా పాల్గొంటూ జానపద కళారూపాల ప్రాచుర్యానికి అంకిత భావంతో కృషిచేస్తున్న వ్యక్తి డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి. ఈయన మా కోరిక మేరకు జానపద కళలు- ఆవిర్భావాలు, వాటి విశిష్టత, అభ్యున్నతి తదితరఅంశాలు గురించి ఇకపై వరసక్రమంలో భావతరంగిణి పాఠకులకు అందిచనున్నారు. ఈ నేపధ్యంల్లో తొలిగా ఆయన పరిచయాన్ని క్లుప్తంగా అందిస్తున్నాం. - ఎడిటర్*

ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి రాష్ట్రంలోని అనేక కళాసంస్థల్లో కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్ కార్యనిర్వాహక సభ్యులుగా, జానపద యువకళాకారుల సంఘానికి అధ్యక్షులుగా, 'రేడియో ఎల్లయ్య మామా' జానపద అకాడమీలో కన్వీనరుగా, నృత్యాంజలి జానపద కళల సంస్థ సలహాదారులుగా ఇంకా అనేకానేక సంస్థల్లో ఈయన ముఖ్య భూమికలు నిర్వర్తిస్తున్నారు. జానపదకళ, కళాకారుల అభ్యున్నతికి అవిశ్రాంత కృషి సాగిస్తున్న కృష్ణారెడ్డికి వివిధ సంస్థల ఆధ్వర్యాన జరిగిన సత్కారాలు, సన్మానాలకు కొదవే లేదు. ఈయన 'భావతరంగిణి' ప్రతినిధితో మాట్లాడుతూ నిజమైన కళాకారులకు తగిన చేయూత నివ్వాలన్నారు. కొంతమంది సరైన పరిజ్ఞానం లేకుండానే మెహర్బాణి వ్యవహారాలు చేసి తమ గొప్పతనాన్ని చాటుకుంటున్నారని ఆయన విమర్శించారు. కనీసం ప్రదర్శనలకు వెళ్ళే సందర్భంలోనైనా కళాకారులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. వృద్ధకళాకారులకు ఇస్తున్న రెండువందల రూపాయల పెన్షను ఏ మాత్రం సరిపోదని, కనీసం వెయ్యి రూపాయలకుపెంచాలని డా॥ చిగిచెర్ల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏది ఏమైనా విశిష్టత సంతరించుకున్న జానపదకళను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చాలా పిన్నవయస్సులో చూసిన పిల్లల ఆట, పాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ⊙

# విన్నపం సన్మానాలేకాదు సాపాటు ముఖ్యమే!

ప్రభుత్వం కళాకారులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఆదరించాలని శ్రీ విఘ్నేశ్వర బుర్రకథ దళానికి చెందిన యడవల్లి బ్రదర్స్ కోరారు. ప్రస్తుతం చాలామంది జానపద కళాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోయారు. రాష్ట్రంలో ఉన్న కళాకారులను, కళాసంస్థలను గుర్తించి తగిన విధంగా న్యాయం చేయాలని వారు అభ్యర్థించారు. తాడేపల్లి గూడెంకు చెందిన ఈ కుటుంబంలోని అయిదుగురుఅన్నదమ్ములు కళాకారులే. వీరిలో ముగ్గురు దళంగా ఏర్పడి 1982 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలోని వివిధ



ప్రాంతాలలో కొన్నివేల బుర్రకథ ప్రదర్శనలిచ్చారు. అలాగే వివిధసంస్థలఆధ్వర్యాన జరిగిన పోటీలలో పాల్గొని అనేక బహుమతులు పొందారు. తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో జరిగిన బుర్రకథ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్నారు. 1988 నుంచి ఆకాశవాణిలో కథలు చెప్పటం ప్రారంభించారు. 1997లో వీరి స్వీయరచన "వనసంపద" దూరదర్శన్‌లో ప్రసారమైంది. అలాగే జానపదపాటల పోటీల్లో కూడా పలుచోట్ల బహుమతులు, సన్మానాలందుకున్నారు.

- శివశ్రీ, దెందులూరు.